ప్రజాశక్తి
శనివారం 24 డిసెంబర్ 2022
5
విజయనగరం



నాన్ అకడమిక్ బాధ్యతలు ఇక ఎపిఎంలదే

విజయనగరం టౌన్ : విద్యాశాఖకు సంబందిచిన నాన్ అకడమిక్ బాధ్యతలు ఇక నుంచి డిఆర్‌డిఎలో పని చేస్తున్న ఎపిఎంలదే అని జిల్లా విద్యాశాఖాదికారి బి. లింగేశ్వర రెడ్డి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఎంఇఒలు, ఎపిఎంతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఇఒ మాట్లాడుతూ మండల స్థాయిలో ఉన్న అన్ని మండల విద్యాశాఖలకు సంబందించిన నాన్ అకాడమిక్ పనులు ఎంఇఒల నుంచి వెలుగు ఎపిఎంలకు అప్పగిస్తున్నట్లు తెలిపారు. జగనన్న విద్యా కానుక, జగనన్న అమ్మ ఒడి, జగనన్న గోరుముద్ద తో పాటు మనబడి నాడు- నేడు తదితర పనులను పర్యవేక్షించే బాధ్యతలను అప్పగిస్తున్నట్లు తెలిపారు. అకడమిక్, నాన్ అకడమిక్ పనుల వల్ల ఎంఇఒలు పని ఒత్తిడికి గురవుతున్నారని, అందువల్ల ప్రభుత్వం ఈనిర్ణయం తీసుకుందని తెలిపారు. ముఖ్యంగా పాఠశాలలో క్లీన్‌అండ్ గ్రీన్ పాటించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తున్నట్లు సమగ్ర శిక్ష ఎపిసి వి.స్వామినాయుడు అన్నారు. విద్యాశాఖతో, సెర్ఫ్‌విభాగం కూడా కలిసి పనిచేయడం ద్వారా పనులు మరింత వేగవంతం అవుతాయని అన్నారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ డిడి, సమగ్రశిక్షా సెక్ట్రోరియల్ సిబ్బంది, ఎంఇఒలు, ఎపిఎంలు పాల్గొన్నారు.

వైసిపిది రంగుల రాజకీయం

- ఇసుక దందా, మద్యం దోపిడీ పెచ్చుమీరాయి
- గిరిజన వర్సిటీకి అతీగతీ లేదు
- ఎయిర్‌పోర్టు ఎంత వరకు వచ్చిందో?
- బొబ్బిలి సభలో ప్రభుత్వంపై విరుచుకుపడిన టిడిపి అధినేత చంద్రబాబు



అరటిపండ్లు కొనుగోలు చేస్తున్న చంద్రబాబు



బొబ్బిలిలో బహిరంగ సభకు హాజరైన జనం



అభివాదం చేస్తున్న చంద్రబాబు

ప్రజాశక్తి -బొబ్బిలి, రూరల్, తెర్లాం, బాడంగి

వైసిపి ప్రభుత్వం రంగుల రాజకీయం చేస్తోందని, ఇక ప్రజలు విశ్వశించే పరిస్థితి లేదని టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అన్నారు. రాష్ట్రంలో ఇసుక దందా, మద్యం పేరిట దోపిడీ పెచ్చుమీరాయని విమర్శించారు. రెండో రోజు పర్యటనలో భాగంగా బొబ్బిలిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. వైసిపి అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో అభివృద్ధి కుంటుబడిందన్నారు. తాము నిర్మించిన టిడ్కో ఇళ్ల రంగులతో కాలక్షేపం చేస్తున్నాడని, రంగుల ముఖ్యమంత్రిగా జగన్ చరిత్రకెక్కుతారని విమర్శించారు. జిల్లాలో భోగాపురం ఎయిర్‌పోర్టు ఒక్క అడుగు కూడా ముందుకు సాగలేదన్నారు. పాలకుల చేతకాని తనం వల్ల జిల్లాకు మంజూరైన గిరిజన వర్శిటీకి అతీగతి లేకుండా పోయిందన్నారు. తోటపల్లి ప్రాజెక్టును ప్రారంభించింది, పూర్తిచేసింది టిడిపి హయాంలోనేనని అన్నారు. వంశధార - నాగావళి అనుసంధానానికి ప్రణాళిక రూపొందించామని చెప్పారు. బొబ్బిలి టౌన్‌లోని పాఠశాలల్లో సుద్ధముక్కలు, తెల్లకాగితాలకు కూడా డబ్బులు కొరవడ్డాయని, నాడు - నేడు పథకం ఏమైందని ప్రశ్నించారు. చదువుకోవాల్సిన ప్రాంగణాల్లో సచివాలయాల కట్టడాన్ని కోర్టు కూడా కుదరదని చెప్పిందని, ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకోవాలని అన్నారు. భూమి పట్టాలపైనా, సర్వే రాళ్లపైనా జగన్ బొమ్మలు వేసుకోవడం సిగ్గుచేటన్నారు. స్థానిక సంస్థల అధికారులను, విధులను జగన్ ప్రభుత్వం కాలరాస్తోందని, సర్పంచులకు విధి దీపాలు వేసే అధికారం, చెత్తను తొలగించే ఆర్థిక శక్తి లేకుండా చేశారన్నారు. ఉద్యోగులతోపాటు, వ్యాపారులూ నిర్భయంగా ఉండాలని, అందరికీ టిడిపి అండగా ఉంటుందని అన్నారు. బొబ్బిలి ఎమ్మెల్యే అనుయాయులు వెయ్యి గజాల విలువైన స్థలం కొట్టేశారని, మంత్రి బొత్స మేనల్లుడు జిల్లాలో ఇసుక దోపిడీకి పాల్పడుతున్నారని విమర్శించారు. వైసిపి పాలనపై బొబ్బిలి పులిలై గర్జించాలని పిలుపునిచ్చారు. బాబు ప్రసంగం పార్టీ శ్రేణుల్లో జోష్ తెప్పించినప్పటికీ, చివరిలో సైకోపాలన పోవాలని అనబోయి సైకిల్ పాలన పోవాలంటూ చంద్రబాబు నోరు జారారు. వెంటనే తేరుకుని ప్రజలకు క్షమాపణ చెప్తూ ఆ మాటను వెనక్కి తీసుకుంటున్నట్టు చెప్పారు. సమయం లేదు మిత్రమా అంటూ బాలకృష్ణ డైలాగ్ వేయడంతో యువత, కార్యకర్తలు కేరింతలు కొట్టారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన అధ్యక్షతన జరిగిన సభలో మాజీ మంత్రి సుజయ్‌కృష్ణ రంగారావు, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు మాట్లాడారు.

అడుగడుగునా ఘన స్వాగతం

టిడిపి అధినేత చంద్రబాబుకు అడుగడుగునా నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. రెండోరోజు శుక్రవారం రాజాంలోని తృప్తి రిసార్ట్సు నుంచి ప్రారంభమైన చంద్రబాబు రోడ్డుషో ఒమ్మి, పెరుమాళి, వెలగవలస, తెర్లాం, రేజేరు, కారాడ మీదుగా రాత్రి 6 గంటలకు బొబ్బిలిలోని గొల్లపల్లి చేరుకుంది. కంచరాం వద్ద సుజయకృష్ణ, తెంటు రాజా, ఆర్‌పి భంజ్‌దేవ్, విజయనగరం పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షులు కిమిడి నాగార్జున ఘన స్వాగతం పలికారు. తెర్లాంలో రోడ్డుషో సందర్భంగా సర్పంచ్ బోనాల రూప.. చంద్రబాబుకు బొట్టు పెట్టి, హారతి ఇచ్చారు. గొల్లపల్లి- పిరిడి జంక్షన్ వద్ద టిడిపి బొబ్బిలి నియోజకవర్గ ఇంచార్జి బేబినాయన, విశాఖ ఎమ్మెల్యే గణబాబు స్వాగతించారు. గొల్లపల్లి - పిరిడి జంక్షన్ నుంచి బైక్‌లతో భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ గొల్లపల్లి, ఓంకార్ టాకీస్, బజారు, ఎన్‌టిఆర్ బొమ్మ, స్టేట్ బ్యాంక్, రైల్వేస్టేషన్ జంక్షన్, పోలీసు స్టేషన్ మీదుగా వాటర్ ట్యాంకు వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభ స్థలం వద్దకు చేరుకుంది.

బెల్లం క్రషర్ పరిశీలన

బాడంగి మండలం రేజేరు బెల్లం క్రషర్లు వద్ద ఆగి చెరకు రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. చెరకు దిగుబడి, గిట్టుబాటు ధరపై ఆరా తీశారు. చక్కెర పరిశ్రమ మూతతో ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రహదారి పక్కనే అరటిపండ్లు అమ్ముకుంటున్న వ్యక్తితో ముచ్చటించారు. ఆయన వద్ద అరిటిపండ్లు కొని అక్కడే ఉన్న పిల్లలకు, స్థానికులకు పంచిపెట్టారు.

ఉత్తరాంధ్రపై రెడ్ల పెత్తనం ఎందుకు?

విజయనగరం ప్రతినిధి / రాజాం : టిడిపి ఆవిర్భావంతో బిసి సామాజిక వర్గాలు రాజకీయంగా, సామాజికంగా అభివృద్ధి చెందాయని, జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక వారిపై రెడ్లపెత్తనం పెరిగిందని టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు అన్నారు. బిసిలలో అన్ని వృత్తుల వారూ ఆర్థికంగా దెబ్బతిన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం రాజాంలో బిసిలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 50 శాతానికిపైగా ఉన్న బిసిలను ఆర్థికంగా పైకి తీసుకొచ్చేందుకు టిడిపి పుట్టుకతోనే ప్రణాళికలు రూపొందించి, అమలు చేసిందని అన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే 20శాతం మద్యం దుకాణాలు కల్లుగీత కార్మికులకు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఉత్తరాంధ్రలో ప్రస్తుతం సాయిరెడ్డి, సుబ్బారెడ్డి పెత్తనం చేస్తున్నారని విమర్శించారు. వారికి అడ్డుకట్ట వేయలేని బొత్స బొత్స సత్యనారాయణ టిడిపిపై విమర్శలు చేస్తున్నారని అన్నారు. సమావేశంలో కళా వెంకటరావు, కొల్లు రవీంద్ర, కె.అచ్చెన్నాయుడు తదితరులు పాల్గొన్నారు.



5కె వాక్‌లో పాల్గొన్న ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు

సిపిఎస్ రద్దుచేయాల్సిందే

యుటిఎఫ్ ఆధ్వర్యాన ఉపాధ్యాయుల 5కె వాక్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సిపిస్ రద్దు చేసి, ఒపిఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ యుటిఎఫ్ ఆధ్వర్యాన శుక్రవారం ఉపాధ్యాయులు ఐదు కిలోమీటర్ల వాక్‌ను నిర్వహించారు. జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జెఎసి చైర్మన్ జె.మురళీ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ర్యాలీ ఆర్‌టిసి కాంప్లెక్సు, బాలాజీ జంక్షన్ మీదుగా గంటస్తంభం వరకు సాగింది. ఈ సందర్భంగా జెఎసి, యుటిఎఫ్ నాయకులు మాట్లాడుతూ ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు వారం రోజుల్లోనే సిపిఎస్ రద్దుచేసి ఒపిఎస్ అమలు చేస్తామని 2వందల సార్లు హామీ ఇచ్చారన్నారు. సిపిఎస్‌కు ప్రత్యామ్నాయం జిపిఎస్ కాదని ఒపిఎస్ మాత్రమేనని అన్నారు. ఒపిఎస్ ను అమలు పరిస్తే ఆర్థికంగా చాలా భారం పడుతుందని సిఎం చెబుతున్నారని, అంతభారమైతే రాజస్థాన్, ఛత్తీస్‌ఘడ్, జార్ఖండ్, పంజాబ్ రాష్ట్రాలు, త్వరలో హిమాచల్ ప్రదేశ్ వంటి రాష్ట్రం పాత పెన్షన్‌ను ఎలా పునరుద్ధరించాయని ప్రశ్నించారు.

సిపిఎస్ ను రద్దుచేసి ఒపిఎస్ ను అమలుపరచడం ద్వారా మాత్రమే పోరాటాలను ఆపగలరన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జెఆర్‌సి పట్నాయక్, జెఎవిఆర్‌కె ఈశ్వరరావు, రాష్ట్ర నాయకులు కె.విజయ గౌరి, డి.రాము, రాష్ట్ర కౌన్సిలర్ కె.శ్రీనివాసరావు, జిల్లా గౌరవ అధ్యక్షులు ఎ సత్య శ్రీనివాస్, కోశాధికారి సిహెచ్ భాస్కరరావు, జిల్లా సిపిఎస్ కన్వీనర్ సిహెచ్ తిరుపతి నాయుడు, జిల్లా కార్యదర్శులు పి.త్రినాథ, జీవి రమణ, వాసు, సూర్యారావు, రాధా భవాని, శ్రీదేవి, అల్లు శంకరరావు, రాష్ట్ర కౌన్సిలర్స్ కె అప్పారావు, ఎం.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు. మద్దతుగా నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు మువ్వల గంగా ప్రసాదరావు పాల్గొన్నారు.

రోలర్ స్కేటింగ్‌లో విశాల్‌కు బంగారు పతకం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని నారాయణ పాఠశాల పైడితల్లి భవన్‌లో 9వ తరగతి చదువుతున్న విన్సెంట్ విశాల్ 'రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన స్కేటింగ్ పోటీలో జిల్లా స్థాయిలో 3బంగారు పతకాలు సాధించాడు. రాష్ట్ర స్థాయిలో 3 పతకాలు, జాతీయస్థాయిలో 3 బంగారు పతకాలు సొంతం చేసుకున్నాడు. కోచ్‌గా రాజు, బద్రి వ్యవహరించారు. విశాల్ పతకాలు సాధించడం పట్ల తల్లిదండ్రులు విన్సి గ్రేస్, రాజు, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు ప్రభావతీ దేవి అభినందించారు.



బంగారు పతకంలో విద్యార్థి

నెలాఖరులోగా ఇకెవైసి చేయించుకోవాలి

రైతులకు జిల్లా వ్యవసాయ సలహా మండలి సూచన ● ఎరువుల వాడకాన్ని తగ్గించాలని తీర్మానం

ప్రజాశక్తి-విజయనగరం

పిఎం కిసాన్‌కు సంబంధించి ఈ నెలాఖరులోగా ఇకెవైసి చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి విజ్ఞప్తి చేసింది. మరో వారం రోజులు మాత్రమే గడువు ఉండటంతో, మిగిలిపోయిన రైతులంతా వెంటనే ఇకెవైసి తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించింది. జిల్లాలో క్రమంగా రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి, సేంద్రీయ వ్యవసాయాన్ని పెంచాలని మండలి తీర్మానించింది. జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం కలెక్టరేట్ లో శుక్రవారం జరిగింది. వ్యవసాయం, బిందు, తుంపర్ల సేద్యం, పట్టు సాగు, చిరుధాన్యాల సాగు తదితర అంశాలపై చర్చించి, పలు నిర్ణయాలు తీసుకున్నారు. జిల్లా వ్యవసాయ శాఖాధికారి వి.తారకరామారావు సమావేశపు అజెండాను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. సుమారు 20 వేల మందివరకు ఇకెవైసి పెండింగ్ ఉందని చెప్పారు. కలెక్టర్ ఎ.సూర్యకుమారి మాట్లాడుతూ, రసాయనిక ఎరువులకు బదులుగా సేంద్రీ ఎరువులు, పచ్చిరొట్ట, 18 రకాల నవధాన్యాలు వేసిన చోట కూడా అధిక దిగుబడులు వచ్చాయని తెలిపారు. జిల్లాలో క్రమంగా రసాయినిక ఎరువుల వినియోగాన్ని తగ్గించి, సేంద్రీయ వ్యవసాయాన్ని పెంచాలని కోరారు. బిందు, తుంపర్ల సేద్యాన్ని ప్రోత్సహించాలని, దీనిపై రైతులకు అవగాహన కల్పించి, లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ కోరారు.

జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ గేదెల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాగి, మొక్కజొన్న కంకులు కోసిన తరువాత, వాటి మొక్కలను కూడా పచ్చిరొట్ట ఎరువుగా వాడే అవకాశాన్ని పరిశీలించాలని కోరారు. జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ ధాన్యం దిగుబడి ఎక్కువగా వచ్చినందున మిల్లింగ్ ప్రక్రియను వెంటనే మొదలు పెట్టాలని సూచించారు. రవాణా ఛార్జీలతో పాటే, ధాన్యం అన్‌లోడింగ్ ఛార్జీలను కూడా కలిపి చెల్లిస్తారని తెలిపారు. జిల్లాలో ఆయిల్ పామ్‌ను ప్రోత్సహించాల్సి ఉందని, దీనికోసం అదనంగా ఆయిల్ పామ్ యూనిట్‌ను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాలని కోరారు. సమావేశంలో ఎపిఎంఐపి ప్రాజెక్టు డైరెక్టర్ పిఎన్‌వి లక్ష్మీనారాయణ, పట్టుశాఖ ఎడి సాల్మన్ రాజు, డిసిఎంఎస్ ఛైర్మన్ అవనాపు భావన, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, వివిధ శాఖల అధికారులు, సలహా మండలి సభ్యులు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



వ్యవసాయ సలహా మండలి సమావేశంలో మాట్లాడుతున్న జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

చట్టాలపై అవగాహనతోనే మోసాలకు చెక్

జాతీయ వినియోగదారుల దినోత్సవంలో కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం

చట్టాలపై అవగాహన పెంచుకోవటం ద్వారా మోసాలకు చెక్ పెట్టగలమని కలెక్టర్ ఎ.సూర్యకుమారి అన్నారు. నేటి సమాజంలో రోజురోజుకూ మోసాలు పెరిగిపోతున్నాయని, వీటిని అరికట్టేందుకు ప్రజలు అన్ని అంశాలపై అవగాహన పెంచుకోవాలని, ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని సూచించారు. జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక రెవెన్యూ కల్యాణ మండపంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వినియోగదారులు తమ హక్కుల గురించి బాధ్యతల గురించి తెలుసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఆఫర్ల మోజులో పడి మోసపోవద్దని, వస్తువులు కొనుగోలు చేసేటప్పుడు బిల్లులు తప్పనిసరిగా తీసుకోవాలని చెప్పారు.

ఫోరం ద్వారా సులభంగా న్యాయ సేవలు

వినియోగదారుల కమిషన్ జిల్లా అధ్యక్షుడు ఆర్. నాగసుందర్ మాట్లాడుతూ వినియోగదారుల ఫోరం ద్వారా మోసపోయిన వారికి సులభంగా న్యాయ సేవలు అందుతాయని తెలిపారు. లాయర్ సహాయం కూడా లేకుండా వినియోగదారుడే స్వయంగా కేసు ఫైల్ చేసుకోవచ్చని, ఫోరం ద్వారా అన్ని రకాల సేవలు అందుతాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని, అప్పుడే మోసాలను అరికట్టగలమని అన్నారు. అనవసరమైన యాప్‌లను ఆశ్రయించవద్దని సూచించారు. జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ మాట్లాడుతూ వినియోగదారులు ఫిర్యాదుల విధానం గురించి అవగాహన పెంచుకోవాలని, తద్వారా న్యాయం పొందాలని చెప్పారు. కార్యక్రమంలో బ్యూరో ఆఫ్ స్టాండర్డ్స్ జాయింట్ డైరెక్టర్ సుజాత, తూనికలు, కొలతల విభాగం జిల్లా కంట్రోలర్ జనార్థన్, కమర్షియల్ ట్యాక్స్, సైబర్ క్రైం తదితర విభాగాల నుంచి హాజరైన అధికారులు వారి శాఖల కార్యకలాపాల గురించి వివరించారు. వేడుకల్లో భాగంగా పలు విభాగాలు ఏర్పాటు చేసిన ప్రదర్శన శాలలను అధికారులు సందర్శించారు. కార్యక్రమంలో సివిల్ సప్లయి డిఎం మీనాకుమారి, డిఎస్ఒ మధుసూధన్ రావు, సిపిఒ బాలాజీ, ఐసిడిఎస్ పీడీ శాంతకుమారి, లీగల్ మెటరాలజీ డిస్ట్రిక్ట్ కంట్రోలర్ జనార్ధన్, అసిస్టెంట్ కంట్రోలర్ రాధాకృష్ణ, డ్రగ్స్ కంట్రోలర్ భారతి, మార్కెటింగ్ శాఖ ఎడి శ్యామ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ప్రదర్శనలో ఉంచిన వస్తువులను పరిశీలిస్తున కలెక్టర్ సూర్యకుమారి, జెసి అశోక్

సఖి గ్రూపుల సహాయంతో సామాజిక చైతన్యం

విజయనగరం : జిల్లాలో అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకొని ఆచరణలో పెట్టిన సఖి గ్రూపుల ద్వారా సామాజిక చైతన్యం పెరిగిందని, అదే తరహాలో అమలు చేసిన చిట్టి గురువుల కార్యక్రమం ద్వారా జిల్లాలో అక్షరాస్యత 78 నుంచి 93 శాతానికి పెరిగిందని జిల్లా కలెక్టర్ ఎ. సూర్యకుమారి పేర్కొన్నారు. ఇదంతా జిల్లా స్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకు అందరూ సమష్టిగా కృషి చేసి సాధించిన విజయమని హర్షం వ్యక్తం చేశారు. గుడ్ గవర్నెన్స్ వారోత్సవాల్లో భాగంగా స్థానిక రెవెన్యూ కల్యాణ మండపంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. జిల్లా ప్రజల్లో ముఖ్యంగా మహిళల్లో సామాజిక చైతన్యం తీసుకొచ్చేందుకు, అక్షరాస్యత పెంపొందించేందుకు నిర్ణయించిన కార్యక్రమాలు సత్ఫలితాలను ఇచ్చాయని అన్నారు. సమాజంలో మార్పు, టెక్నాలజీ పేరుతో.. నాగరికత అనే ముసుగులో సంస్కారం కోల్పోతున్నామని అది మంచి పరిణామం కాదని ఆవేదన వ్యక్తం చేశారు. చదువుతో పాటు ప్రతి ఒక్కరిలో సంస్కారం పెరగాలన్నారు. యువత చెడు వ్యసనాల బారిన పడకుండా మెరుగైన సమాజ నిర్మాణంలో భాగస్వామ్యం కావాలని ఆమె పిలుపునిచ్చారు. గుడ్ గవర్నెన్స్‌లో అమలు చేస్తున్న విధానాల గురించి సిపిఒ బాలాజీ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో జెసి కె.మయూర్ అశోక్, వినియోగదారుల కమిషన్ జిల్లా అధ్యక్షులు ఆర్.నాగసుందర్, సివిల్ సప్లై డిఎం మీనాకుమారి, డిఎస్ఒ మధుసూధనరావు, సచివాలయాల జిల్లా కో-ఆర్డినేటర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఎట్టి పరిస్థితుల్లోనూ ఇళ్లు కట్టించాల్సిందే

ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి-విజయనగరం

ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్దేశించిన లక్ష్యాల మేరకు ఇళ్ల నిర్మాణాలు చేపట్టాల్సిందేనని, పూర్తి బాధ్యత ఇంజినీరింగ్ అసిస్టెంట్లదేనని జిల్లా కలెక్టర్ ఎ. సూర్యకుమారి పేర్కొన్నారు. మరింత శ్రద్ధ వహించి శత శాతం ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశించారు. సాంకేతిక సమస్యలు ఉంటే ఉన్నతాధికారుల సహాయం తీసుకొని ముందుకెళ్లాలని చెప్పారు. గృహ నిర్మాణాలు, ఇతర ప్రభుత్వ భవన నిర్మాణాల ప్రగతిపై ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఇతర అధికారులతో ఆమె శుక్రవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో సమావేశం నిర్వహించారు. సచివాలయం పరిధిలోని లే అవుట్ల వారీగా ఇళ్ల నిర్మాణాలు ప్రగతిపై ఆరా తీశారు. ప్రగతి సరిగా చూపని ఇంజినీరింగ్ సహాయకులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వాలంటీర్లు సహాయంతో క్షేత్ర స్థాయిలో లబ్ధిదారులతో మాట్లాడి నిర్మాణాల్లో పురోగతి సాధించాలని ఆదేశించారు. నిర్మాణాలు ముగింపు దశకు చేరుకున్న తరుణంలో కొంత మంది ప్రాథమిక కారణాలను చెప్పటంపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. నిర్దేశిత లక్ష్యాల మేరకు అందరూ ఫలితాలు సాధించాలని, మరింత శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు. సమావేశంలో హౌసింగ్ పీడీ రమణ మూర్తి, ఇంజినీరింగ్ అధికారులు, సచివాలయాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సూర్యకుమారి



ధర్నా చేస్తున్న విద్యార్థులు, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

అధిక ఫీజులపై విద్యార్థుల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రభుత్వం నిర్దేశించిన ఫీజు కన్నా అధిక మొత్తం లో ఫీజులు వసూలు చేస్తున్న గాయత్రీ డిగ్రీ కళాశాల యాజమాన్యం పై చర్యలు తీసుకోవాలని కోరుతూ కళాశాల విద్యార్థులు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ ఎఫ్ ఐ జిల్లా సహాయ కార్యదర్శి సతీష్ దేవ్ సింగ్ మాట్లాడుతూ డిగ్రీ కళాశాలలు సెమిస్టర్ పరీక్షకు రూ.1255 తీసుకోవాల్సి ఉంటే దారుణంగా రూ.3500 వసూలు చెయ్యడం దుర్మార్గమైన చర్యని అన్నారు. ల్యాబ్‌ల్లో ఎటువంటి సౌకర్యాలు లేకుండా వేలల్లో ఫీజులు వసూలు చేయడం అన్యాయమని అన్నారు. విద్యార్థులకు పెంచిన పరీక్ష ఫీజును రద్దు చేసి , ఇప్పటికే బలవంతంగా కట్టిన ఫీజును వెనక్కి ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల పోరాటానికి దిగి వచ్చిన కళాశాల యాజమాన్యం పెంచిన ఫీజును రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శులు ఎం.హర్ష , జె.రవి కుమార్, నాయకులు రమేష్ , బాలాజీ, శివ, పైడి ,రాజు , వంశీ, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు అండగా ఉంటాం : జనసేన

విజయనగరం టౌన్ : రైతులకు అండగా నిలవడం తమ బాధ్యత అని జనసేన నాయకులు గురాన అయ్యలు అన్నారు..శుక్రవారం దుప్పాడలో రైతు దినోత్సవం సందర్భంగా రైతులను సన్మానించారు. ఈ సందర్భంగా అయ్యలు మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం పూర్తి స్థాయిలో కొనుగోలు చేయకపోవడం, తీసుకున్న ధాన్యానికి ఖాతాల్లో నగదు జమ చేయకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారని అన్నారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలవలస యశస్వి, పార్టీ నాయుకులు బి.చంద్రునాయుడు, ఆదాడ మోహన్‌రావులు తదితరులు పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే చంద్రబాబు అబద్ధాలు

వైసిపి జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అబద్ధాలు ఆడుతూ అధికారంలో ఉన్నప్పుడు ఏమి చేశారో చెప్పలేక ముఖ్యమంత్రిని, మంత్రులను దుర్భాషలడటం చూస్తుంటే ఓటమి భయం చంద్రబాబులో కనిపిస్తుందని వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం జెడ్‌పి సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజాం సభలో మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో పరిశ్రమలు వెళ్లిపోయాయన్న ఆయన హయాంలో చంద్రబాబు ఎన్ని పరిశ్రమలు ఏర్పాటు చేశారో చెప్పాలన్నారు. విశాఖ పట్నం ఆర్థిక రాజధానిగా చేస్తానని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. విశాఖ పట్నం దానికదే అభివద్దే చెందే దశలో ఉన్న నగరమన్నారు. బిసి మహిళా మంత్రిని తొలగించి ఎవరికి మంత్రి పదవి ఇచ్చారో చంద్రబాబు గుర్తు చేసుకోవాలన్నారు. తమ ముఖ్యమంత్రి బిసిలకు పెద్ద పేట వేసి ఉప ముఖ్యమంత్రి పదవులు, జెడ్‌పిలో 100 శాతం పదవులు ఇచ్చిన ఘనత వైసిపి ప్రభుత్వానిదన్నారు. అబద్ధాలు, మోసాలతో అధికారంలోకి రావడానికి చూస్తున్నారని, అది జరగదని అన్నారు. రూ.2కే కిలో బియ్యం ఎన్టీఆర్ అమలు చేస్తే దాన్ని రూ.5 చేసింది మీరు కాదా అని ప్రశ్నించారు. మళ్లీ వైఎస్ అధికారంలోకి వచ్చిన తరువాత రూ.2 చేసిన విషయం తెలియదా అని ప్రశ్నించారు. మీ అబద్ధాలు జిల్లా ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. వ్యక్తిగత దూషణలు మాని ఉత్తరాంధ్రకు జిల్లాకు ఏమి చేశారో చెప్పాలన్నారు. పేద వాడికి సంక్షేమ పథకాలు నేరుగా ఇస్తే దాన్ని చూడలేక విమర్శలు చేస్తున్నారన్నారు. రానున్న ఎన్నికలు సిఎం జగన్ చెప్పిన విధంగా పెత్తందార్లకు, పేదలకు మధ్య జరిగే ఎన్నికలన్నారు. పేదలను ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చేస్తున్న జగన్మోహన్‌రెడ్డి వెంట ఈ జిల్లాలు ఉంటాయన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ సురేష్ బాబు, మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు, ఎంఎస్ఎన్ రాజు పాల్గొన్నారు.

కబడ్డీ విజేతలకు అభినందనలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

క్రీడాకారులలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. ఈనెల 20, 21 తేదీల్లో జరిగిన సిఎం కప్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలలో జిల్లాకు చెందిన నెల్లిమర్ల నియోజకవర్గం జట్టు మూడవ స్థానంలో నిలిచింది. ఈ నేపథ్యంలో శుక్రవారం క్రీడాకారులు, కోచ్ లు డిప్యూటీ స్పీకర్‌ను,, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు జి ఈశ్వర్ కౌశిక్ లను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు పుష్పగుచ్చమిచ్చి అభినందనలు తెలియజేశారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కాళ్ళ సూరిబాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీ పతివాడ శ్రీను తదితరులు ఉన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న సత్య విద్యాసంస్థల డైరెక్టర్ మజ్జి శశిభూషణరావు, తదితరులు

'సత్య' విద్యార్థులకు బంగారు పతకాలు

ప్రజాశక్తి-విజయనగరం

తోటపాలెంలో గల సత్య డిగ్రీ కళాశాలలో డిగ్రీ విద్యార్థులు ఇటీవల విశాఖలో జరిగిన ఆంధ్ర యూనివర్సిటీ ఇంటర్ కాలేజీ ఎట్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ వెయిట్ లిఫ్టింగ్‌లో బంగారు పతకాలను సాధించారు. ప్రథమ సంవత్సరం విద్యార్థి ఎస్.పల్లవి 64 కేజీల విభాగంలోను, డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న సిహెచ్ మధు 102 కేజీల విభాగంలోను, వి.నరసింహనాయుడు 73 కేజీల విభాగంలోను బంగారు పతకాలు సాధించారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో కళాశాల సంచాలకులు డాక్టర్ ఎం శశిభూషణరావు మాట్లాడుతూ విద్యార్థులు కోచ్ చల్లా రాము ఆధ్వర్యంలో శిక్షణ పొంది పతకాలు సాధిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం వి సాయి దేవ మణి, ఎన్‌సిసి ఆఫీసర్లు కెప్టెన్ సత్యవేణి, ఎం.ఉదయ్ కిరణ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని నిరసన

ప్రజాశక్తి-బొబ్బిలి

సిఎం జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీ ప్రకారం రెగ్యులర్ చేయాలని శుక్రవారం 108 ఉద్యోగులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సంఘం నాయకులు వేణు మాట్లాడుతూ ప్రయివేట్ ఏజెన్సీ రద్దు చేసి రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో 108 ఉద్యోగులు వెంకటరమణ, అప్పారావు, శోభన్‌బాబు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై ప్రజావేదిక

ప్రజాశక్తి-కొత్తవలస

స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఉపాధి హామీ ద్వారా జరిగిన అభివృద్ధి పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ, జెడ్‌పిటిసి నెక్కల శ్రీదేవి మాట్లాడుతూ మండలంలో ఉపాధి హామీ ద్వారా అనేక పనులు చేపట్టినట్లు తెలిపారు. ప్రజా వేదికలో ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా పి.జనార్దన్, విజిలెన్స్ అధికారిగా ఎస్.రవీంద్ర, ఎపిడి ఎస్.పద్మజ, ఎం.శేషగిరిరావు, వి.విజయనాథ్, సి.హెచ్.నాయుడు, సి.హెచ్.చిరంజీవి, అప్పారావు, ఎంపిడిఒ వై.పద్మజ, ఎపిఒ విజయ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ చేపడుతున్న విద్యార్థులు, సంస్థ ప్రతినిధులు

మట్టిని సంరక్షించండి

ప్రజాశక్తి-కొత్తవలస

మట్టిని సంరక్షించుకోవాలని సేవ్ సోల్ సంస్థ ప్రతినిధి ఐ.విటల్‌రాజ్ కోరారు. శుక్రవారం ఆంజనేయపేటలోని చైతన్య మానసిక వికలాంగుల ఆశ్రమంలో ఆ సంస్థ ఆధ్వర్యాన విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విటల్‌రాజ్ మాట్లాడుతూ మట్టి క్షీణించడం అరికట్టకపోతే ఈ గ్రహం మనిషికి నివాస యోగ్యంగా ఉండదన్నారు. ప్రపంచ వ్యాప్తంగా వ్యవసాయ భూములు సారాన్ని కోల్పోతూ శక్తి విహీనమవుతున్నాయని చెప్పారు. వ్యవసాయ భూముల్లో కనీసం 3-6 శాతం సేంద్రీయ పదార్థం ఉండేలా చట్టాలు రూపొందించాలన్నారు. అనంతరం ఆశ్రమంలో 60 మంది మానసిక వికలాంగులకు విఠల్‌రాజ్ తన తల్లి కృష్ణవేణి 15వ వర్ధంతి సందర్భంగా అన్నదానం ఏర్పాటు చేశారు. హాస్టల్ గదుల్లో ఫ్లోరింగ్ టైల్స్ కొనుగోలు నిమిత్తం సన్యాసిరావుకు రూ.60,500 చెక్కు అందించారు. కార్యక్రమంలో ప్రతినిధులు వంశీప్రియ, రామన్, ఆశ్రమ వ్యవస్థాపకులు భోజంకి సన్యాసిరావు పాల్గొన్నారు.


క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు

'నారాయణ'లో క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

స్థానిక నారాయణాస్ కేంబ్రిడ్జ్ స్కూల్లో చిన్నారుల కేరింతల మధ్య శుక్రవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సి.హెచ్.శేషు మాట్లాడుతూ అన్ని మతాలవారు స్నేహ భావంతో మెలగాలన్నారు. మత సామరస్యాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. విద్యార్థులు మేరీమాత, జోసఫ్, దేవదూతలు, గొర్రెల కాపరి, శాంతాక్లాజ్ వేషదారణల్లో ఆకట్టుకున్నారు. క్రిస్మస్ ట్రీని అందంగా అలంకరించి జింగిల్ బెల్స్ ఆలపించారు. కార్యక్రమంలో పాఠశాల ఎజిఎం ఎం.శివరాం, శ్రీనివాసరావు, డీన్ శ్రీరామ్మూర్తి, కో-ఆర్డినేటర్లు నాజినీ, గ్రేసీ, వైస్ ప్రిన్సిపల్స్ ఎఎన్ ఆర్.లక్ష్మి, రోజా, తదితరులు పాల్గొన్నారు.

నేడు వైసిపి ఆధ్వర్యంలో..

విజయనగరంటౌన్ : వైసిపి క్రిస్టియన్ మైనార్టీ విభాగం ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి నివాసంలో శనివారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆ విభాగం నాయకులు చిట్టి , భాస్కర్, విజయ్ తెలిపారు. శుక్రవారం కోలగట్ల నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. శనివారం ఉదయం 9 గంటలకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి చేతుల మీదుగా కేక్ కటింగ్ జరుగుతుందని తెలిపారు. క్రీస్తు త్యాగాలను స్తుతిస్తూ ఆధ్యాత్మిక గీత లాపన, సందేశాలు ఉంటాయని తెలిపారు. సమావేశంలో కార్పొరేటర్ పొట్నూరు శ్రీనివాసరావు, ధర్మదాస్, కౌశిక్, బలివాడ రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సక్రమంగా ఆటోలు నడపాలి

ప్రజాశక్తి-రామభద్రపురం

స్కూల్ పిల్లలను తీసుకువెళ్లే ఆటో డ్రైవర్లు సక్రమంగా వాహనాలు నడపాలని ఎస్ఐ సురేంద్రనాయుడు తెలిపారు. ఇటీవల ఆటో ప్రమాదం సంభవించి విద్యార్థులు ప్రమాదం బారిన పడటంతో శుక్రవారం విద్యార్థులను తరలిస్తున్న పలు ఆటోలను సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లతో మాట్లాడుతూ అన్ని రకాల ధ్రువపత్రాలు కలిగి ఉండాలని సూచించారు. మద్యం సేవించి డ్రైవ్ చేయరాదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఎస్ఐలు అప్పారావు, చిన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యేలు కడుబండి శ్రీనివాసరావు, శంబంగి వెంకట చినప్పలనాయుడు

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు

ఎమ్మెల్యేలు కడుబండి, శంబంగి

ప్రజాశక్తి-కొత్తవలస

విద్యార్థుల బంగారు భవిష్యత్తే ప్రధాన లక్ష్యంగా విద్యా రంగంలో ప్రభుత్వం ఎన్నో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిందని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు తెలిపారు. కొత్తవలస జిల్లా పరిషత్తు హైస్కూల్లో శుక్రవారం ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఎంఇఒ జి.శ్రీదేవి ఆధ్వర్యంలో ట్యాబ్‌ల పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తూ పలు సంస్కరణలు చేశారని గుర్తు చేశారు. ఒకవైపు చదువు, మరోవైపు బలవర్థకమైన ఆహారాన్ని అందిస్తూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు సకల సౌకర్యాలు కల్పిస్తోందని ఉద్ఘాటించారు. ప్రతిఒక్కరూ బాగా చదువుకొని జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. విద్యారంగంలో గతానికి, వర్తమానానికి చాలా భేదం ఉందని, మార్పు స్పష్టంగా కనిపిస్తోందని పేర్కొన్నారు. పాఠశాల స్థాయిలో విద్యార్థులు అనర్గళంగా ఆంగ్లంలో మాట్లాడటమే మార్పుకు నిదర్శనమన్నారు. అనంతరం 260 మంది విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కొప్పల వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, కొత్తవలస పిఎసిఎస్ అధ్యక్షులు గోరపల్లి శివ, ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ, జెడ్‌పిటిసి నెక్కల శ్రీదేవి, ఎంఇఒ శ్రీదేవి, సర్పంచులు బొడ్డు అప్పారావు, కోన దేముడు, మదిన అప్పలరమణ, వైసిపి నాయకులు ఒబ్బిన నాయుడు, ఐతంశెట్టి శ్రీనివాసరావు, అనిల్, ఎంఎల్ఒ ఈశ్వర అప్పారావు, హెచ్ఎం బండారు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురం : ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ విప్లవానికి శ్రీకారం చుట్టిన ఏకైక ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్ రెడ్డి చరిత్రలో నిలిచిపోతారని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు అన్నారు. రామభద్రపురం జిల్లా పరిషత్తు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఎంపిపి చొక్కాపు లక్ష్మణరావు ఆధ్వర్యంలో ట్యాబులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శంబంగి మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఆరో తరగతి నుంచి 12వ తరగతి వరకు డిజిటల్ క్లాస్ రూమ్స్ ఏర్పాటు చేయబోతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి అప్పికొండ సరస్వతి, ఎంఇఒ తిరుమల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఆ నేత్రాలు సజీవం

ప్రజాశక్తి-మెరకముడిదాం

ఓ వృద్ధురాలు మరణిస్తూ మరొకరి జీవితాల్లో వెలుగులు నింపింది. మండలంలోని పెద్దమంత్రిపేటకు చెందిన వృద్ధురాలి మరణానంతరం ఆమె నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. మండలంలోని పెద్దమంత్రిపేట గ్రామానికి చెందిన అంపోలు వరహాలమ్మ (92) శుక్రవారం మృతిచెందారు. వరహాలమ్మ కుమారులు రామునాయుడు, సత్యనారాయణ, కుటుంబసభ్యులు ఆమె నేత్రాలను దానం చేయాలని నిర్ణయించారు. వెంటనే మానవీయత స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు బి.వి.గోవిందరాజులుకు తెలియజేశారు. ఆయన రెడ్‌క్రాస్ సంస్థకు సమాచారం అందించడంతో ఆ సంస్థ ద్వారా నేత్రాలను సేకరించారు. నేత్రదానానికి పూనుకున్న వరహాలమ్మ కుటుంబ సభ్యులను గ్రామస్తులు అభినందించారు.

చెరువు ఆక్రమణపై ఫిర్యాదు

ప్రజాశక్తి-వేపాడ

చెరువు ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని కరకవలసకు చెందిన రైతులు శుక్రవారం తహశీల్దార్ కృష్ణంరాజుకు ఫిర్యాదుచేశారు. గ్రామానికి చెందిన దుల్ల దివాకర్ చెరువును కబ్జా చేసేందుకు మట్టి వేసి పూడ్చేస్తున్నారని, సర్వే నంబర్ 25లో గెడ్డ పోరంబోకుని కూడా ఆక్రమించేందుకు పూనుకున్నారని వివరించారు. వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని ఎర్రాప్రగడ సూర్యం, శంకర్రావు, అప్పారావు, తదితరులు కోరారు.

బెదిరించి సంతకాలు చేయించుకున్నారు

సిపిఎం బృందం వద్ద చామలాపల్లి దళితుల ఆవేదన

ప్రజాశక్తి-వేపాడ

'సంతకాలు పెట్టకుంటే కేసులు పెడతామని బెదిరించారు. బలవంతంగా భూములు అమ్మినట్లు సంతకాలు చేయించుకున్నారు. కనీసం ఏం రాశారో కూడా తెలియద'ని చామలాపల్లి దళితులు సిపిఎం బృందం వద్ద ఆవేదన వ్యక్తంచేశారు. మండలంలోని చామలాపల్లి భూబాధిత దళితులను శుక్రవారం సిపిఎం నాయకులు మద్దిల రమణ, గాడి అప్పారావు, చెలికాని ముత్యాలు పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత రైతులు బుడుమూరి పైడమ్మ, మట్ట రాముడమ్మ, తదితరులు తమకు జరిగిన నష్టాన్ని సిపిఎం బృందానికి వివరించారు. తమకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం సిపిఎం నాయకులు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా కొనుగోలు చేసి, 12 మంది దళితులకు పాతికేళ్ల క్రితం 24.22 ఎకరాలను పంపిణీ చేసిందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన భూముల్లో దళితులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవారని చెప్పారు.

దళితులంతా నిరక్షరాస్యులు కావడం, వారి ఆర్థిక ఇబ్బందులను ఆసరాగా తీసుకున్న కొంతమంది దళారులు ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా పంపినట్లు దొంగ నోటీసులు సృష్టించారని చెప్పారు. డబ్బులు చెల్లించుకుంటే భూమిని ప్రభుత్వం తిరిగి తీసుకుంటుందని అమాయక దళితులను భయభ్రాంతులకు గురిచేశారన్నారు. భూమిపై రుణాలు ఇప్పిస్తామని, ఆ రుణాలతో డబ్బులు చెల్లించాలని మాయమాటలు చెప్పి 11 మంది దళితులను కొత్తవలస సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి తీసుకెళ్లి సంతకాలు తీసుకున్నారని తెలిపారు. కనీసం భూమి రిజిస్ట్రేషన్ చేయించుకున్న విషయం బాధిత దళితులకు తెలియదని ఆవేదన వ్యక్తంచేశారు. పేద దళితుల భూముల వ్యవహారంలో జిల్లా కలెక్టర్ సమగ్ర విచారణ చేపట్టి, బాధితులకు తిరిగి భూములు ఇప్పించాలని విజ్ఞప్తిచేశారు. దళితులకు భూములు ఇప్పించే వరకూ వారు చేపట్టే పోరాటానికి అండగా నిలుస్తామని భరోసానిచ్చారు.


బాధిత దళితులతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

మెరకముడిదాం మండలంలో
నేడు మంత్రి బొత్స పర్యటన

ప్రజాశక్తి-మెరకముడిదాం

మండలంలో శనివారం మంత్రి బొత్స సత్యనారాయణ పర్యటించనున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు మెరకముడిదాం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేయనున్నారు. అనంతరం ఇప్పలవలస గ్రామంలో సచివాలయ భవనాన్ని ప్రారంభించనున్నారు.

ఒడిఎఫ్ సర్వే

ప్రజాశక్తి-శృంగవరపుకోట

ఉన్నత భారత్ అభియాన్ ఆధ్వర్యాన స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సిహెచ్ కేశవరావు అధ్యక్షతన విద్యార్థులు కళాశాల దత్తత గ్రామాలైన బర్మాకాలనీ, పుణ్యగిరిలో శుక్రవారం ఒడిఎఫ్ సర్వే చేపట్టారు. బహిరంగ మలమూత్ర విసర్జన ద్వారా వచ్చే వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలని ప్రిన్సిపల్ సూచించారు. మరుగుదొడ్లు మాత్రమే ఉపయోగించాలని కోరారు. కళాశాల ఉన్నత భారత అభియాన్ కోఆర్డినేటర్ బి.సంధ్యారాణి, తదితరులు పాల్గొన్నారు.


హ్యాండ్ వాష్ స్టేషన్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ సురేష్‌బాబు

వ్యక్తిగత పరిశుభ్రత అవసరం

ఎమ్మెల్సీ సురేష్‌బాబు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

అందరికీ వ్యక్తిగత పరిశుభ్రత అవసరమని ఎమ్మెల్సీ సురేష్‌బాబు అన్నారు. శుక్రవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో యునిసెఫ్ సహకారంతో ఏర్పాటు చేసిన హ్యాండ్ వాష్ స్టేషన్‌ను ఎమ్మెల్సీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశుభ్రత పాటించక పోవడం వల్ల ఎన్నో అంటు రోగాలు వ్యాప్తి చెంది అనారోగ్యాలకు కారణమవుతున్నాయన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కోవిడ్ వ్యాప్తి చెందే అవకాశాలు ఉన్నాయని, చేతులు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దీనిలో భాగంగా ప్రభుత్వం యునిసెఫ్ అత్యవసర నిధుల నుంచి హ్యాండ్ వాష్ స్టేషన్ ఏర్పాటు చేసిందన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజినీ, వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, కమిషనర్ పి.బాలాజీ ప్రసాద్, మెప్మా పీడీ బి. సుధాకర రావు, సిఎంఎం డి.గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం


లబ్ధిదారులతో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజాశక్తి-బొబ్బిలి

పేదల అభ్యున్నతే లక్ష్యంగా సిఎం జగన్మోహన్ రెడ్డి పనిచేస్తున్నారని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలో మూడో వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఆయన ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం ఇంటింటికి తిరుగుతూ వృద్ధులను, మహిళలను పేరుపేరునా ఆప్యాయంగా పలకరిస్తూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి పాలన సాగిస్తున్నారని తెలిపారు. అమ్మఒడి, వైఎస్ఆర్ కాపు నేస్తం, ఆరోగ్యశ్రీ, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన వంటి సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. పార్టీలకతీతంగా అర్హులందరికీ తమ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తుందని చెప్పారు. మాయమాటలు, మోసపూరిత వాగ్దానాలిచ్చి పబ్బం గడుపుకునే ప్రభుత్వం తమది కాదన్నారు. వచ్చే ఎన్నికల్లో జగనన్నను ప్రజలంతా ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో భాగంగా వార్డులో ప్రజలు సిసి రోడ్లు, కల్వర్టులు, డ్రెయిన్లు నిర్మించాలని ఎమ్మెల్యేను కోరారు. దానికి ఆయన స్పందిస్తూ సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణారావు, వైస్ చైర్‌పర్సన్ గొలగాన రమాదేవి, వైసిపి మండల అధ్యక్షులు శంబంగి వేణుగోపాలనాయుడు, మూడో వార్డు ఇన్‌ఛార్జి గండి నక్షత్ర, తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకూ కోలగట్ల

విజయనగరం టౌన్ : నగరంలోని 36వ డివిజన్ సున్నంబట్టి వీధిలో శుక్రవారం నిర్వహించిన గడప గడపకూ కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు ఏ విధంగా అందుతున్నాయో ప్రజలను అడిగి తెలుసుకున్నారు. వాలంటరీ వ్యవస్థ ద్వారా సకాలంలో నేరుగా తమ ఖాతాలకు ప్రభుత్వ పథకాలు జమవుతున్నాయని అన్నారు. మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ అవినీతి, లంచగొండితనం లేకుండా లబ్ధిదారుల ఖాతాలకు నేరుగా సచివాలయ వ్యవస్థ ద్వారా అందుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రేవతి దేవి, సహాయ కమిషనర్ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎంవిజిఆర్ సిల్వర్ జూబ్లీ వేడుకలు

ప్రజాశక్తి-డెంకాడ

ఎంవిజిఆర్ ఇంజినీరింగ్ కళాశాల సిల్వర్ జూబ్లీ వేడుకలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. రెండు రోజులపాటు నిర్వహించే ఈ వేడుకలకు మాన్సాస్ చైర్మన్ పూసపాటి అశోక్ గజపతి రాజు, సెంచూరియన్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ జి.ఎస్.ఎన్ రాజు, ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రాంగణంలో ఎంవిజిఆర్ పాతికేళ్ల ప్రయాణ ఫొటో ఎగ్జిబిషన్, ఎక్స్‌పో, బాయ్స్ హాస్టల్‌లో డివాట్స్ సిస్టమ్, 50 కెడబ్ల్యుపి రూఫ్ టాప్ సోలార్ పవర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంవిజిఆర్ ప్రస్తుత, గత పాలకమండలి సభ్యులందరినీ ఆహ్వానించి ప్రిన్సిపల్ కె.వి.ఎల్ రాజు పాలకమండలి సమావేశాన్ని నిర్వహించారు. ప్లేస్‌మెంట్స్ డీన్ సునీల్ ప్రకాశ్ వేడుకలకు పరిశ్రమ నుండి వచ్చిన అతిథులకు కృతజ్ఞతలు తెలిపారు. మేధా సర్వో డ్రైవ్స్ పరిశ్రమ హెచ్‌ఆర్ మేనేజర్ పి.అప్పలరాజు మాట్లాడుతూ విద్యార్థులు స్థానికంగా కాకుండా ఎల్లప్పుడూ ప్రపంచవ్యాప్తంగా ఆలోచించాలని, ప్రపంచ సామర్థ్యాలను కలిగి ఉండాలని పేర్కొన్నారు. టిసిఎస్ టాలెంట్ అక్విజిషన్ గ్రూప్ ప్రతినిధి కార్తీక్ అభిరామకృష్ణ, టెక్ మహీంద్ర డెలివరీ హెడ్ రవిచంద్ర, తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రాజెక్టులను పరిశీలిస్తున్న మాన్సాస్ చైర్మన్ అశోక్ గజపతిరాజు

సర్పంచ్ ఇల్లు దగ్ధం

ప్రజాశక్తి - జామి

మండలంలోని తానవరం సర్పంచ్ పి.బుచ్చమ్మ ఇల్లు శుక్రవారం దగ్ధమైంది. బుచ్చమ్మ కుటుంబ సభ్యులు ఎప్పటిలాగే ఉదయం పొలం పనులకు వెళ్లిపోయారు. బుచ్చమ్మ ఇంట్లో దీపం మంటలు వ్యాపించి ఇంటి సీలింగ్, పర్నీచర్ పూర్తిగా ఖాళీ బూడిదయ్యాయి. ఇంట్లో ఉన్న సర్పంచ్ బుచ్చమ్మ స్పృహ తప్పి పడిపోవడంతో స్వల్ప గాయాలయ్యాయి. ఇంటి నుంచి మంటలు రావడాన్ని గమనించిన స్థానికులు మంటలను ఆర్పి, బుచ్చమ్మను బయటకు తీశారు. వెంటనే స్థానిక వైద్య సిబ్బంది వైద్యం అందించారు. ప్రస్తుతం సర్పంచ్ బుచ్చమ్మ ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు.

రైతుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

రైతుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని జనసేన రాష్ట్ర ప్రచారకార్యదర్శి పాలూరి బాబు ఆగ్రహం వ్యక్తంచేశారు. శుక్రవారం మండలంలోని పారాది గ్రామంలో రైతులతో జనసేన నాయకులు మాట్లాడి, వారి సమస్యలను తెలుసుకున్నారు. వచ్చే ఎన్నికల్లో పవన్ కల్యాణ్‌కు అవకాశం ఇవ్వాలని కోరారు. అప్పుడే రైతుల కష్టాలు తొలగుతాయని చెప్పారు. కార్యక్రమంలో జనసేన నాయకులు లంక రమేష్, మండల అధ్యక్షులు సంచన గంగాధర్, సత్య, రాజా, సతీష్, మౌళి, బుడి రాజా, తదితరులు పాల్గొన్నారు.

బాడంగి : రైతే దేశానికి వెన్నెముకమని, కానీ నేడు ఆ రైతే ఎన్నో కష్టాలు అనుభవిస్తున్నాడని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి గిరడ అప్పలస్వామి ఆవేదన వ్యక్తంచేశారు. నియోజకవర్గంలో పలువురు రైతులకు శుక్రవారం జనసేన ఆధ్వర్యాన సన్మానించారు.

గరివిడి : చీపురుపల్లిలోని జనసేన పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షులు విసినిగిరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రైతు దినోత్సవాన్ని నిర్వహించారు. మండలంలో కొంతమంది రైతులకు సన్మానాలు చేశారు. అనంతరం శ్రీనివాసరావు తుమ్మగంటి సూరినాయుడు మాట్లాడుతూ రైతులను వైసిపి ప్రభుత్వం విస్మరించిందని విమర్శించారు. కనీసం గిట్టుబాటు ధర ఇవ్వకుండా, రైతుల నుండి ధాన్యం కూడా కొనుగోలు చేసే పరిస్థితిలో కూడా లేదన్నారు. కౌలురైతుల కుటుంబాలకు సాయం చేస్తున్న జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్‌ను వైసిపి నాయకులు విమర్శించడం సిగ్గుచేటన్నారు. జనసేన ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులకు ఉచిత సోలార్ యూనిట్లు, 60 ఏళ్లు దాటిన కౌలురైతులకు నెలకు రూ.5 వేలు ఇస్తామని హామీనిచ్చారు. వ్యవసాయం చేయాలనుకునే యువ రైతులకు ప్రభుత్వ భూమిని లీజుకు ఇచ్చి వారిని ప్రోత్సహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో టి.సూరినాయుడు, రామచంద్రరాజు, ఆదినారాయణ, రామచంద్రరావు, లక్ష్మణనాయుడు, తవిటినాయుడు, కిరణ్, నరసింహ పాల్గొన్నారు.



గరివిడి.. రైతులను సన్మానిస్తున్న జనసేన పార్టీ నాయకులు

నెల్లిమర్ల : రైతులకు జనసేన అండగా ఉంటుందని ఆ పార్టీ నియోజకవర్గ నాయకులు లోకం మాధవి స్పష్టంచేశారు. దుర్గాసి శేఖర్ ఆధ్వర్యంలో మండలంలోని గుషిని, అలుగోలు, సతివాడ, తమ్మాపురం గ్రామాల్లో జనసేన నాయకులు పర్యటించారు. రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు పతివాడ అచ్చెంనాయుడు, నాయకులు కల్యాణం అనిల్, బొమ్మలాట గురుమూర్తి, మొయిద లక్ష్మణ రావు, వి.రమణ, జి.త్రినాథ్, సారిపల్లి శంకర్, జగదీష్, ఆల్తి దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

డెంకాడ : డెంకాడలో జనసేన మండల అధ్యక్షులు పతివాడ కృష్ణవేణి ఆధ్వర్యంలో రైతులను సన్మానించారు. అనంతరం రైతులకు లుంగీలు, మాస్కులు, టవళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర మహిళా రీజనల్ కోఆర్డినేటర్ తుమ్మి లక్ష్మీరాజ్, మత్స్యకార విభాగ కార్యదర్శి కారి అప్పలరాజు, నాయకులు పిన్నింటి రాజారావు, వందనాల రమణ, జలపాలి అప్పలదొర, దిండి రామారావు, ఊర్ల విజయ్‌శంకర్, తొత్తిడి సూర్యప్రకాశ్, రామ్‌లక్ష్మణ, తుమ్మి అప్పలరాజుదొర, దుక్క అప్పలరాజు, అట్టాడ ప్రమీల, కె.సంతోష్, కలిశెట్టి శివవిశ్వనాథ్, తదితరులు పాల్గొన్నారు.